మనం
అనంతపురం / శ్రీ సత్యసాయి జిల్లా
సోమవారం - 11 - మే - 2026 : పేజీలు 6

## 14న మంత్రి నారా లోకేష్ బత్తలపల్లికి రాక



**బత్తలపల్లి, మే 10 మనం న్యూస్:** రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ఈనెల 14న బత్తలపల్లికి వస్తున్నట్లు తెదేపా వర్గాలు పేర్కొన్నాయి. ఆర్డీటి సంస్థకు ఎఫ్సీఆర్ఏ రెన్యువల్ కాకపోతే నారా లోకేష్ సంస్థ సేవలను గుర్తించి నేనున్నానంటూ భరోసా ఇచ్చి కేంద్రంతో పలుసార్లు చర్చలు జరిపి ఒప్పించి రెన్యువల్ అయ్యే విధంగా చేశారు. ఈనెల 15న పుట్టపర్తిలో జరిగే ప్రధాన కార్యక్రమానికి హాజరవుతుండగా ముందు రోజే బత్తలపల్లికి వచ్చి సంస్థ ఆసుపత్రి సేవలను పరిశీలించడానికి వస్తున్నారు. 14వ తేదీన విజయవాడ నుంచి నేరుగా పుట్టపర్తి విమానాశ్రయంలో దిగి అక్కడి నుంచి రోడ్డు మార్గాన బత్తలపల్లికి వస్తున్నట్లు వివరించారు.



- గుంతకల్లు మార్కాపూర్ రోడ్‌కు నూతన ప్యాసింజర్ రైలు మంజూరు
- తిరుమల ఎక్స్‌ప్రెస్ సేవలు గుంతకల్లు వరకు విస్తరణ
- 12న గుంతకల్లు రైల్వే స్టేషన్‌లో ప్రారంభించనున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

## గుంతకల్లు కేంద్రంగా రెండు కీలక రైల్వే సేవలు ప్రారంభం

**అనంతపురం. మే 10 మనం న్యూస్ ప్రతినిధి :** అనంతపురం పార్లమెంట్ నియోజకవర్గ ప్రజల చిరకాల కోరికలను నెరవేర్చుతూ కేంద్ర రైల్వే శాఖ రెండు కీలక నిర్ణయాలు తీసుకుంది. అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ నిరంతర కృషి ఫలితంగా గుంతకల్లు -- మార్కాపూర్ రోడ్ మధ్య నూతన రోజువారీ పాసింజర్ రైలు (నెం. 57407/57408) మంజూరైంది.ప్రస్తుతం కడప -- విశాఖపట్నం మధ్య నడుస్తున్న తిరుమల ఎక్స్‌ప్రెస్ (ట్రైన్ నెం. 18521/18522) సేవలను గుంతకల్లు వరకు విస్తరించేందుకు రైల్వే శాఖ ఆమోదం తెలిపింది. ఈ రెండు రైలు సేవలను ఈనెల 12న గుంతకల్లు రైల్వే స్టేషన్‌లో అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ జెండా ఊపి ప్రారంభించ నున్నారు. గుంతకల్లు -- మార్కాపూర్ రోడ్ పాసింజర్ రైలు ప్రతిరోజూ సాయంత్రం 5:30 గంటలకు గుంతకల్లులో బయలుదేరుతుంది. అదేవిధంగా తిరుమల ఎక్స్‌ప్రెస్ ఇకపై గుంతకల్లు -- విశాఖపట్నం మధ్య సాధారణ షెడ్యూల్ ప్రకారం నడవనుంది. గుంతకల్లు రైల్వే స్టేషన్ నుండి ప్రతి రోజు మధ్యాహ్నం 1:30 గంటలకు ఈ రైలు బయలుదేరనుంది. ఈ సేవల విస్తరణతో అనంతపురం జిల్లా ప్రజలకు విశాఖపట్నం సహా ఉత్తరాంధ్ర ప్రాంతాలకు ప్రయాణ సౌకర్యం మరింత మెరుగుపడనుంది. ఈ సందర్భంగా ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, సీఎం నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్, కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి సోమన్న, రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేష్ లకు ధన్యవాదాలు తెలిపారు.

### ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ప్రోత్సాహంతో

## పోలీసులకు 7 నూతన రక్షక్ వాహనాలు

- జెండాఊపి ప్రారంభించిన జిల్లా ఎస్పీ సతీష్ కుమార్
- ప్రజల భద్రతే లక్ష్యంగా పోలీసు శాఖకు సహకారం అందజేసిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేసిన ఎస్పీ

**హిందూపురం (మనం న్యూస్) మే 10:** హిందూపురం నియోజకవర్గంలో శాంతిభద్రతల పరిరక్షణకు అత్యవసర పరిస్థితులలో రక్షక వాహనాలు ఎంతో దోహదపడతాయని జిల్లా ఎస్పీ ఎస్ సతీష్ కుమార్ అన్నారు. పోలీసులకు సహాయం అందించేలా పోలీసు స్టేషన్లలో సిబ్బంది మొబిలిటీ పెంచేలా కొత్త రక్షక్ వాహనాలను ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ చొరవ చూపి అందజేయడంపై జిల్లా ఎస్పీ ధన్యవాదాలు తెలియజేశారు. హిందూపురం వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో సిఎస్ఆర్ ఫండింగ్ కింద రూ.15 లక్షల విలువైన 7 రక్షక్ వాహనాలకు సంబంధించి జిల్లా ఎస్పీ సమక్షంలో పోలీసు శాఖకు తాళాలను ఎమ్మెల్యే బాలకృష్ణ సహాయ కార్యదర్శులు వీరయ్య, సురేంద్ర ఆదివారం సాయంత్రం అందజే శారు. ఈ సందర్భంగా ఎస్పీ వాహనాలకు పూజ చేసి ప్రారంభించారు. అనంతరం ఎస్పీ మాట్లా





డుతూ పోలీసుల తక్షణమే స్పందించేందుకు,రాత్రి పహారా బలోపేతానికి రక్షక్ వాహనాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. అత్యవసర కాల్స్ వచ్చినప్పుడు పోలీసులు వీలైనంత త్వరగా స్పందించి ఘటనా స్థలాలకు చేరుకునేందుకు శాంతి భద్రతలను కాపాడేందుకు ఈ రక్షక్ వాహనాల రాకతో సులభతరం అయిందన్నారు. ఇప్పటికే మూడు బొలెరో వాహనాలు పోలీసు శాఖకు అందాయని, ప్రస్తుతం ఈ వాహనాల రాకతో మొత్తం 10 వాహనాలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. సున్నితమైన నియోజకవర్గంలో పోలీసులు ఏవైనా ఘటనలు జరిగినప్పుడు తక్షణమే స్పందించేందుకు అవకాశం దొరుకుతుందన్నారు. డిఎస్పి కేవీ మహేష్ ఆధ్వర్యంలో ఆయా పోలీసు స్టేషన్ల సిబ్బంది ఈ వాహన సేవలను

మిగతా 2లో

## రాగులకైనా మోక్షముందా..?

- వాతావరణం అనుకూలించడంతో మంచి దిగుబడులు
- నిరుత్సాహంగా ధరలు
- ప్రభుత్వ సేకరణపైనే ఆశలు
- రైతుల ఎదురుచూపులు ఫలిస్తాయా? లేదా మొక్కజొన్న మాదిరిగా అవుతుందా?

**చిలమత్తూరు, మే 10, మనం న్యూస్ :** అష్టకష్టాల్లో కొట్టుమిట్టాడుతున్న రైతన్నలకు రాగి పంట సాగు ఆశాజనకంగా కనబడింది. ప్రభుత్వమిచ్చిన ప్రోత్సాహకంతో మరింత ధైర్యంతో సాగుకు ముందుకుపోయారు. వాతావరణం అనుకూలించడంతో మంచి దిగుబడులు పొందారు. తీరా పంట చేతికి వచ్చాకా ధరలు పడిపోవడంతో బిక్కు బిక్కుమంటున్నారు. ప్రభుత్వం ప్రకటించిన విధంగా మద్దతు ధరకు సేకరిస్తుందనే ఆశతో ఎదురుచూస్తున్నారు. పంట పండినప్పుడు ధరలు పడిపోవడం.. ధర ఉన్నప్పుడు పంట పండకపోవడం.. రెండూ ఉన్నప్పుడు పంట పెట్టుబడి భారీగా పెరిగి గిట్టుబాటు కాకపోవడం.. ఇదీ రైతన్నలు అనునిత్యం ఎదుర్కొంటున్న పరిస్థితి. ఇలాంటి పరిస్థితే ఇప్పుడు రాగిపంట సాగు చేసిన రైతులు ఎదుర్కొంటున్నారు. తక్కువ పెట్టుబడి, తక్కువ రిస్క్, ధర గ్యారెంటీ అనే నమ్మకంతో సాగు చేసిన రైతులకు ధర పడిపోవడంతో ప్రభుత్వ హామీ వైపు ఎదురు చూస్తున్నారు. గడిచిన కొన్ని సంవత్సరాలుగా పడిపోయిన రాగి పంట సాగు విస్తీర్ణం, ఈ ఏడాది రాగి పంటే ఆశాజనకంగా కనిపించడంతో



మండల పరిధిలో రబీ సాగు ద్వారా 585 ఎకరాల్లో పంట వేశారు. ప్రభుత్వం కూడా మద్దతు ధర 4880 రూపాయలు ప్రకటించడంతో ఉత్సాహంగా పంట వేయడానికి మొగ్గు చూపారు. వాతావరణం అనుకూలించడంతో ఎకరానికి 15 నుంచి 20 క్వింటాళ్లు వరకు దిగుబడి వచ్చింది. అయితే రైతుకు పంట చేతికి వచ్చే సమయానికి బయట మార్కెట్ లో ధర 3000 నుంచి 3300కు పలుకుతోంది. అది కూడా పంట వడిపే సమయంలో వర్షం రాకపోవడంతో నాణ్యమైన, మంచి రంగు ఉన్న రాగులు పండాయి. అయితే పంట సాగు ఖర్చులు విపరీతంగా పెరగడంతో పెట్టుబడులు విపరీతంగా పెరిగాయి. ప్రస్తుత మార్కెట్ ధరల ప్రకారం పెట్టుబడి కూడా చేతికందే పరిస్థితి లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ప్రకారం వెంటనే సేకరించి తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

## బీటీపీ ఆయకట్టుదారులను అభినందించిన ఎమ్మెల్యే కాలవ

**రాయదుర్గం మే 10 మనం న్యూస్ :** వరి సాగులో రికార్డు స్థాయి దిగుబడులు సాధించి ఆదర్శంగా నిలిచిన రైతులను రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు అభినందించారు. ఆదివారం ఆయన గుమ్మగట్ట మండలం, కలుగోడు గ్రామంలో భైరవాణి తిప్ప ప్రాజెక్ట్ ఆయకట్టు పరిధిలో సాగైన వరి పంటను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో కలిసి పంట పొలాల్లో కలియతిరిగిన ఆయన, వరి సాగు అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. ?అనంతరం ఆయన మాట్లాడుతూ... రైతులు పురుగు మందుల వాడకాన్ని తగ్గించి, కేవలం ఎరువులతో శాస్త్రీయ పద్ధతులను అనుసరించడం వల్లే నాణ్యమైన అధిక దిగుబడులు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. రైతు సంతోషంగా ఉంటేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని, కష్టపడి వ్యవసాయం చేస్తూ తోటి రైతులకు వీరు స్ఫూర్తిగా నిలుస్తున్నారని కొనియాడారు. ఈ ఏడాది ఆయకట్టుకు సకాలంలో సాగునీరు అందడం వల్ల రైతులు మెరుగైన ఫలితాలు సాధించగలిగారని, సాగునీటి నిర్వహణలో అధికారులు, ఆయకట్టుదారులు సమన్వయంతో పనిచేశారని తెలిపారు. ?తుంగభద్ర ప్రాజెక్టు గేట్ల మరమ్మతుల కారణంగా ఈసారి రబీ సీజన్‌లో ఎడమ కాలువలకు సాగునీరు విడుదల చేయలేదని, దీనివల్ల కనేకల్లు, బీటీపీ పరిధిలో పండిన పంటకు మార్కెట్‌లో విపరీతమైన డిమాండ్ పెరిగిందని ఎమ్మెల్యే వివరించారు. స్థానిక వ్యాపారులతో పాటు కర్ణాటక నుంచి కూడా వ్యాపారులు వస్తుండటంతో, ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర కంటే బహిరంగ మార్కెట్లోనే అధిక ధర

మిగతా 2లో



## పోలీసులకు 7 నూతన రక్షక్ వాహనాలు

(మొదటి పేజీ తరువాయి)

సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తో పాటు డీఎస్పీ కేవీ మహేష్, సి ఐ లు ఆంజనేయులు,కరీం, ఎమ్మెల్యే సహాయ కార్యదర్శులు వీరయ్య, సురేంద్ర, బాలాజీ,ఎస్సైలు రాజేష్, లింగన్న, శ్రీధర్ ,నాగ ప్రసన్న ,పోలీస్ సిబ్బంది టీడీపీ నాయకులు పాల్గొన్నారు.







## నేడు డెడికేటెడ్ కమిషన్ ఛైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా పర్యటన

**అనంతపురం, కలెక్టరేట్ మే10: మనం న్యూస్ :** ఏపీ రాష్ట్రంలోని గ్రామీణ, పట్టణ ప్రాంత స్థానిక సంస్థలలో బి.సి.ల రిజర్వేషన్ల పై అధ్యయనం కొరకు ఏర్పాటు చేయబడిన డెడికేటెడ్ కమిషన్ ఛైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా( ఐ.ఏ.ఎస్ రిటైర్డ్) జిల్లా పర్యటనకు రానున్నారు. జిల్లా పర్యటనలో భాగంగా మే11 సోమవారం రాత్రి అనంతపురము పట్టణం చేరుకుని రాత్రి బస చేస్తారు. మరుసటి దినం 12వ తేది మంగళవారం నాడు ఉదయం 10 గం.ల నుండి మధ్యాహ్నం 1గం.ల వరకు అనంతపురము జిల్లా కలెక్టరేట్ రెవెన్యూ భవనము నందు కుల సంఘాలు, పౌర సమాజ సంస్థలు, ప్రజా ప్రతినిధులు, సాధారణ ప్రజల నుండి వినతులు, విజ్ఞాపనలను స్వీకరిస్తారు. జిల్లాలోని ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరని అనంతపురము జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారిణి కుష్బూ కొఠారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

## భూమి ఆరోగ్యం... రైతు భవిష్యత్తు..

**– రసాయనాలకు దూరం... సహజ సాగుకు స్వాగతం..**
**– మట్టి సారాన్ని కాపాడే మార్గం ప్రకృతి వ్యవసాయం..**
**– రసాయనాలకు దూరం... సహజ సాగుకు స్వాగతం...**



ధర్మవరం అర్బన్ ఏప్రిల్ 10 మనం న్యూస్ ధర్మవరం మండల పరిధిలోని మలకాపురం యూనిట్, రేగాటిపల్లి గ్రామంలో ప్రకృతి వ్యవసాయానికి సంబంధించిన ప్రత్యేక కార్యక్రమం నిర్వహించబడింది. ఆ గ్రామానికి చెందిన రైతు పుల్లమ్మ 5 ఎకరాల పొలంలో పీ ఎం డి ఎస్ విధానంలో ప్రధాన పంటలుగా 5 రకాల పంటలతో పాటు 25 రకాల బయోడైవర్సిటీ విత్తనాలను వినియోగించి సాగు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఘన జీవామృతం ఉపయోగించి, బీజామృతంతో విత్తన శుద్ధి చేసి అనంతరం విత్తనాలను వెదజల్లడం జరిగింది. ప్రకృతి సహజ వ్యవసాయ పద్ధతుల ద్వారా భూమి సారాన్ని పెంపొందించడం, రైతులకు తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించే మార్గాలను పరిచయం చేయడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదినారాయణ , ఓబిలేసు, పక్కిరప్ప, నాగరత్నమ్మ తో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

## హేమావతి శ్రీ హెంజేరు సిద్దేశ్వర స్వామికి విశేష పూజలు

**– దేవస్థానం ప్రధాన అర్చకులు సిద్దలింగేశ్వర స్వామి**



**అమరాపురం, మే 10, మనంన్యూస్:** అతి పురాతనమైన, నొళశీబరాజులు పాలించిన,ప్రసిద్ధిగాంచిన శైవ క్షేత్రమైన హేమావతి శ్రీ సిద్దేశ్వర స్వామి వారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు దేవాలయం ప్రధాన అర్చకులు సిద్దలింగేశ్వర స్వామి తెలిపారు.ఉదయం స్వామి వారికి వివిధ అభిషేకములు,పంచామృతభిషేకం జరిపి,వివిధ పూలమాలలతో ప్రత్యేక అలంకరణ చేసి,నైవేద్యం సమర్పించి మహా మంగళ హారతినిచ్చి,భక్తులకు తీర్థ ప్రసాదం వితరణ చేసారు.ఈ కార్యక్రమంలో ఈ ప్రాంత వాసులే కాక,ఉమ్మడి అనంతపురము జిల్లా,కర్ణాటకలోని వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## హాఫ్ మూన్ మోడల్ బీడు పడిన భూములకు జీవం.

**గుడిబండ మే 10 మనం న్యూస్ :** గుడిబండ మండలం రాళ్ళపల్లి గ్రామంలో ఆదివారం రైతు నాగేశీద్రప్ప గారి బీడుపడిన పొలంలో హాఫ్ మూన్ మోడల్ నిర్మాణం విజయవంతంగా నిర్వహించబడింది. డిపిఎం లక్ష్మీన్ నాయక్ డి టి రమేష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని రైతుల సమక్షంలో నిర్వహించారు. హాఫ్ మూన్ మోడల్ అనేది వర్షపు నీటిని నిల్వ చేసేందుకు ఎత్తు భూముల్లో అమలు చేయబడే అత్యంత ప్రభావవంతమైన పద్ధతి. ఈ మోడల్ను అర్ధచంద్రాకారంలో రూపొందించి, సుమారు 5 అడుగుల ఎత్తు మరియు 2 అడుగుల వెడల్పుతో నిర్మించారు.ఈ విధానం వర్షపు నీటిని భూగర్భానికి చొచ్చుకుపోయేలా చేసి, భూమిలో తేమను నిలుపుతుంది. ఈ విధానంతో మొక్క జొన్న, అలసంద, పంటల అభివృద్ధికి తోడ్పాటు అందుతుందన్నారు. మరియు భూగర్భజల స్థాయి కూడా మెరుగుపడుతుందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా రైతులకు నీటి పరిరక్షణ పద్ధతుల పట్ల అవగాహన పెరిగింది. ఈ విధానాన్ని చూసిన రైతులు తమ భూముల్లో కూడా ఇదే విధానాన్ని అనుసరించాలని నిర్ణయించారు. ఈ ప్రయోగం శాస్త్రీయంగా విజయవంతమవుతుందని నిర్వాహకులు నమ్మకాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కమ్యూనికేషన్ థిమెటిక్ మల్లేశ్వరి మరియు రైతులు పాల్గొన్నారు.



## బీటీపీ ఆయకట్టుదారులను అభినందించిన ఎమ్మెల్యే కాలవ

(మొదటి పేజీ తరువాయి)



లభిస్తోందని ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఎకరాకు సగటున 45 నుండి 50 బస్తాల దిగుబడి రాగా, కొందరు రైతులు ఏకంగా 63 బస్తాల వరకు దిగుబడి సాధించడం విశేషమన్నారు. ?పంట నాణ్యత మెరుగ్గా ఉండటంతో వ్యాపారులు నేరుగా రైతుల వద్దకే వచ్చి కొనుగోలు చేస్తున్నారని, దీనివల్ల రైతులకు గిట్టుబాటు ధర లభించి లాభదాయక పరిస్థితులు ఏర్పడ్డాయని చెప్పారు. సక్రమంగా నీటి సరఫరా అందించిన అధికారులకు ధన్యవాదాలు తెలియజేశారు. చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం రైతులకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ కాలువ సన్నన్న, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ హనుమంత రెడ్డి, వైస్ ఛైర్మన్ దానవేంద్ర, కెపి దొడ్డి నాగరాజు మాజీ కన్వీనర్ గిరిమల్లప్ప,బెలోడు సంజీవ మాజీ సర్పంచ్ నాగరాజు, యన్ తిమ్మప్ప కుమార్ రెడ్డి, శ్రీరాములు కాలువ ఛైర్మన్ కాలువ రాజు, పైదొడ్డి రాజు,మూర్తి అంజి శివరాజు, సదాశివ, మల్లారెడ్డి తదితరులు నాయకులు పాల్గొన్నారు.

## మీ కోసం కాల్ సెంటర్ సేవలను వినియోగించుకోండి

**– ఈనెల 11వ తేదీన కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం నిర్వహణ**
**-- సోమవారం ఉదయం 9:00 నుండి పిజిఆర్ఎస్ నిర్వహణ**
**-- రెవెన్యూ పరిధిలోని అన్ని ఫిర్యాదుల పరిష్కార అధికారుల కార్యాలయాలలో “మీకోసం టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్ 1100” అనే బ్యానర్‌ను ఏర్పాటు చేయాలి**
**-- జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి**
**-- జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్**



**అనంతపురం, కలెక్టరేట్ మే10 :** మనం న్యూస్ మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చునన్నారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి మీకోసం .ఏపీ .గవర్నమెంట్ .ఇన్ (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. రెవెన్యూ పరిధిలోని అన్ని ఫిర్యాదుల పరిష్కార అధికారుల కార్యాలయాలలో “మీకోసం టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్ 1100” అనే బ్యానర్‌ను ఏర్పాటు చేయాలన్నారు.

**నేడు కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం నిర్వహణ**

నేడు అనంతపురం కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్), రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్లోని రెవెన్యూ భవనంలో ఉదయం 9:00 నుండి నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. వడగాలుల అంచనా మరియు ప్రస్తుతం నెలకొన్న అధిక ఉష్ణోగ్రతల దృష్ట్యా, మరియు ప్రజలు, ముఖ్యంగా వృద్ధులు మరియు మహిళలు సుదూర గ్రామాలు మండలాల నుండి వస్తున్నందున, ప్రజా భద్రత దృష్ట్యా మరియు వడదెబ్బను నివారించడానికి, సోమవారం ఉదయం 9:00 నుండి పిజిఆర్ఎస్ గ్రీవెన్స్ డేను నిర్వహించడం జరుగుతుంద న్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తమ వివరాలతో పాటు వారి సమస్యలకు సంబంధించి అర్జీలను అందజేయాలన్నారు. అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించిన స్లిప్పును తీసుకురావాలని సూచించారు. సమస్య పరిష్కారమైనప్పుడు ఫోన్ కి మెసేజ్ వస్తుందని, అర్జీదారులు వారి ఫోన్ ను చెక్ చేసుకోవాలన్నారు. నోటీసులు, ఎండార్స్మెంట్ ను వాట్సఅప్ లో పంపిస్తున్నామని, ఎండార్స్మెంట్ బై రిజిస్టర్ పోస్ట్ మీరు ఇస్తున్న అడ్రస్ కు పంపిస్తున్నామన్నారు. అర్జీ ఇచ్చేటప్పుడు దానిని కరెక్ట్ గా దానిని పూరించాలన్నారు. రిపీటెడ్ అర్జీదారులు పాత రసీదును తీసుకురావాలన్నారు. జిల్లా ప్రజలు పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సోమవారం ఉదయం 9:00 నుండి పూర్తి అయ్యే వరకు డివిజన్, మండల మరియు ఎస్.జి.ఎస్.డబ్ల్యూ స్థాయిలలో పి.జి.ఆర్.ఎస్. గ్రీవెన్స్ డేను నిర్వహించాలని ఆర్.డి.ఓలు, తహసీల్దార్లు పి.డి.ఓలకు సూచించడమైనది.

## గీతం కాలేజీ కరస్పాండెంట్ మనిషి నాయర్ ను వెంటనే అరెస్ట్ చేయాలి

**ఎమ్మార్పీఎస్ నేత చిన్న ఆంజనేయులు**



**అనంతపురం మే 10 మనం న్యూస్ :** అనంతపురం జిల్లా కేంద్రంలో ఈనెల రెండవ తేదీన మనం సీనియర్ జర్నలిస్టు లక్ష్మీనారాయణపై దాడి చేసిన శ్రీ గీతం కాలేజీ కరస్పాండెంట్ మనీషా నాయర్ ను, ఆమె గుండాలను వెంటనే అరెస్టు చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకుడు చిన్న ఆంజనేయులు డిమాండ్ చేశాడు. మనం రిపోర్టర్ లక్ష్మీనారాయణ సీనియర్ జర్నలిస్టు తో పాటు దళిత కుటుంబానికి చెందిన వాడని ఆయన శ్రీ గీతం కాలేజీ చేస్తున్న మోసాలు, అన్యాయాలపై వరుసగా వార్తా కథనాలు రాశాడు. ఇది జీర్ణించుకోలేని శ్రీ గీతం జూనియర్ కాలేజీ కరస్పాండెంట్ మనీషా నాయర్, తమ గుండాలతో పట్టపగలు మారునాయుధాలతో ఇంటిలోకి చొరబడి లక్ష్మీనారాయణ పై విచక్షణ రహితంగా దాడి చేశారు. ఈ దాడిని అడ్డుకోబోయిన భార్యపైన విచక్షణ రహితంగా కొట్టారు. అడ్డొచ్చిన చిన్న పిల్లవాడిని సైతం దూరంగా విసిరేశారు. అంతటితో ఆగకుండా లక్ష్మీనారాయణను చెప్పుల కాళ్లతో తన్నుతూ , చంపుతామని బెదిరించి కాళ్లు మ్రొక్కించుకోవడం, సభ్య సమాజం తలదించేలా ప్రవర్తించడం ముమ్మాటికి క్షమించరాని నేరం, ఇలాంటి నేరస్తులను తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని చిన్న ఆంజనేయులు డిమాండ్ చేశాడు. మనీషా నాయర్ చెబుతున్న ఉచిత విద్య అంతా బోగస్ అని, ఈ జిల్లాలో ఉచిత విద్యను అందిస్తున్నది ఏకైక సంస్థ ఆర్డీటీ స్వచ్ఛంద సంస్థ మాత్రమేనని, మనీషా నాయర్ అహంతో డబ్బు ఉందన్న పొగరుతో నోటికొచ్చినట్లు వాగుతోందని, విద్యార్థుల తల్లిదండ్రులు ఈ కాలేజీ గురించి తెలుసుకొని పిల్లల భవిష్యత్తు కోసం ఇలాంటి కాలేజీలలో చేర్చకండి అని కోరాడు. ఎస్పీ సార్ ను సైతం ఆమెన్ తప్పు దోవ పట్టించేలా నాకు సపోర్ట్ చేసిన ఎస్పీ గారికి కృతజ్ఞతలు తెలియజేస్తూ సోషల్ మీడియాలో హల్చల్ చేస్తోందని జిల్లాలో ఒక ప్రముఖ కేసులో పోలీసులపై చర్యలు తీసుకున్న కేసులు సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేయకూడదని దుష్ప్రచారం చేసే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ పెట్టిన పోస్ట్ ను ఈమె తనకు అనుకూలంగా మలుచుకుని ఎస్పీ గారికి థాంక్స్ అంటూ పోస్ట్ పెట్టిందని ఇలాంటి ట్రిక్కులు కట్టిపెట్టి చేసిన తప్పును ఒప్పుకుని శిక్ష అనుభవించాలని ఆయన డిమాండ్ చేశాడు. పోలీసు శాఖపై మాకు నమ్మకం ఉందని,ఈమెను తక్షణం అరెస్టు చేసి శిక్షించాలని ఆయన పోలీసులను డిమాండ్ చేశాడు.



# కార్యకర్తలకు అండగా ఉంటూ ప్రజా సమస్యలపై పోరాడుతాం

**- వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, నియోజకవర్గం పార్టీ సమన్వయ కర్త,మాజీ మంత్రి సాకే శైలజానాథ్**

- శింగనమలలో వైసిపి కార్యాలయం ప్రారంభం

**అనంతపురం. మే 10 మనం న్యూస్ ప్రతినిధి:** ప్రజల సమస్యల పరిష్కారమే తమ ప్రధాన లక్ష్యమని, తాము వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా నిలిచి సమస్యల పరిష్కారం కోసం పోరాడుతామని జిల్లా వైసిపి అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డిలు అన్నారు.ఆదివారం అనంతపురం జిల్లా శింగనమల నియోజకవర్గ కేంద్రంలో నూతన వైఎస్సార్‌సీపీ పార్టీ కార్యాలయాన్ని వారు ప్రారంభించారు. సమావేశంలో వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ పోరాటాలకు పుట్టిన గడ్డ శింగనమలయని అన్నారు. ప్రజల హక్కులు, రైతు సమస్యల పరిష్కారం కోసం శింగనమల ప్రాంత ప్రజలు ఎప్పుడూ ముందుండి పోరాడిన చరిత్ర ఉందన్నారు. అన్యాయం జరిగిన ప్రతిసారి ప్రజల తరపున గళమెత్తిన నేల శింగనమలదని పేర్కొన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్మోహన్ రెడ్డి అనేక సంక్షేమ పథకాలను అమలు చేసి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించారన్నారు. రైతులు, మహిళలు, విద్యార్థులు, నిరుద్యోగ యువత కోసం ప్రవేశపెట్టిన పథకాల ద్వారా ప్రతి కుటుంబానికి మేలు జరిగిందన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. రైతులకు అవసరమైన మద్దతు, పంట నష్టపరిహారం, సాగునీటి సౌకర్యాలు కల్పించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. రాష్ట్ర ప్రయోజనాలను పక్కనపెట్టి స్వప్రయోజనాల కోసం పనిచేస్తూ ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా ఇసుక దోపిడీ, మట్టి దోపిడీ పెరిగిపోయిందని, దీనివల్ల ప్రభుత్వ ఆదాయానికి భారీ నష్టం జరుగుతోందన్నారు. సామాన్య ప్రజలు ఇళ్ల నిర్మాణానికి కూడా ఇసుక అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రైతులు అప్పుల భారంతో ఆత్మవిశ్వాసం కోల్పోతున్న పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం కొనసాగిస్తామన్నారు. మాజీ మంత్రి డాక్టర్ సాకే శైలజానాథ్ మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పనిచేయడానికి ఈ కార్యాలయం ఒక వేదికగా నిలుస్తుందని ఆకాంక్షించారు. కార్యకర్తలే పార్టీకి వెన్నెముకయని, వారి సమస్యల పరిష్కారానికి, ప్రజా పోరాటాలకు ఈ వేదిక అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని,





నియోజకవర్గంలోని ప్రతి గడపకూ పార్టీ సిద్ధాంతాలను తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరచి రైతుల సమస్యలను గుర్తించి వెంటనే నష్టపోయిన రైతులను ఆదుకోవాలన్నారు.సాగునీరు, ఎరువులు, పంటల కనీస మద్దతు ధర వంటి అంశాలపై తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై వైఎస్సార్‌సీపీ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని, కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని స్పష్టం చేశారు. “వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు ఏ కష్టం వచ్చినా నేనున్నానని భరోసా ఇస్తున్నాను. కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటూనే, ప్రజా సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటం చేస్తాం” అని స్పష్టం చేశారుప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిలదీస్తామని, క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై వైఎస్సార్‌సీపీ గళం వినిపిస్తుందని తెలిపారు. నష్టపోయిన రైతుల పక్షాన గళం వినిపించేందుకు ఈ నెల 11వ తేదీ ఉదయం 10 గంటలకు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయనున్నామని, రైతులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ంలో మండల స్థాయి నాయకులు, జడ్పీటీసీలు, ఎంపీపీలు, వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులతో పాటు భారీ సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



## 14న తలనీలాలు వేలం

**నార్పల మే 10 మనం న్యూస్:** ప్రసిద్ధ గూగూడు కుల్లాయి స్వామి దేవస్థానం నందు ఈనెల 14న తలని ప్రోగు చేసుకునే హక్కును వేలం నిర్వహిస్తున్నట్టు ఆలయ ఈవో శోభ వెల్లడించారు. తలనీలాల వేలంతోపాటు ఆలయానికి ఆదాయ వనరులైన సప్లై సామాన్లు బాడుగకు ఇచ్చుకునే హక్కు, కందూరు షెడ్లు నిర్వహణ హక్కు లకు వేలం నిర్వహిస్తున్నట్టు ఆమె తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ముందస్తు ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనాలని ఆమె సూచించారు. దేవాదాయ శాఖ నియమ నిబంధనల మేరకు వేలం పాట జరుగుతుందని ఆమె తెలిపారు. మరిన్ని వివరాల కోసం ఆలయ కార్యాలయం నందు సంప్రదించాలని ఈవో శోభ తెలిపారు.

## పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయండి

**- వైసీపీ నేత గుడ్డంపల్లి వేణురెడ్డి**



**చిలమత్తూరు, మనం న్యూస్ :** వైయ్యస్సార్ సీపీని గ్రామస్థాయిలో బలోపేతం చేయాలని హిందూపురం ఇన్చార్జ్ దీపికమ్మ భర్త గుడ్డంపల్లి వేణురెడ్డి కార్యకర్తలకు, నాయకులకు సూచించారు. చిలమత్తూరులోని వైఎస్సార్సీపీ కార్యాలయంలో బూత్ లెవెల్ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి వేణురెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. పార్టీని బూత్ స్థాయిలో మరింత బలోపేతం చేయడం ప్రతి కార్యకర్త బాధ్యతని గుర్తుచేశారు. ప్రజా సమస్యలను తెలుసుకుంటూ పార్టీ సిద్ధాంతాలను ప్రతి ఇంటికి చేర్చాలని సూచించారు. వైఎస్సార్సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకుపోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ రామకృష్ణారెడ్డి, కే. సురేష్ కుమార్ రెడ్డి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడు తెదేపా మండల స్థాయి సమావేశం



**నల్లచెరువు, మే 10 మనం న్యూస్ :** మండల తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో నేడు మండల స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ మండల కన్వీనర్ రాజశేఖర్ బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కదిరి శాసనసభ్యులు కందికుంట వెంకట ప్రసాద్ ఆదేశాల మేరకు ఉదయం 10 గంటలకు కదిరి--పూలకుంట రోడ్డులోని గీతమందిరంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ సమావేశానికి పార్టీ నాయకులు, సింగిల్ విండో చైర్మన్లు, మార్కెట్ యార్డ్ చైర్మన్, వైస్ చైర్మన్లు, క్లస్టర్ ఇన్‌చార్జీలు, యూనిట్ ఇన్‌చార్జీలు, బూత్ కన్వీనర్లు, తెలుగుయువత, తెలుగురైతు, తెలుగు మహిళ నాయకులు,మాజీ జెడ్పీటీసీలు ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, కార్యకర్తలు,అనుబంధ సంఘాల నాయకులు,అభిమానులు విజయవంతం చేయాలని కోరారు.

# టీడీపీ సభ్యత్వమే కుటుంబానికి రక్షణగా మారింది

**- 5 లక్షల బీమా అందజేత**



**అమడగూరు, మే 10: మనంన్యూస్:** మండల పరిధిలో గుండువారిపల్లి పంచాయతీ పరిధిలోని సోలుకుంట్ల గ్రామానికి చెందిన ఉప్పుతోళ్ల రమణమ్మ కుటుంబానికి తెలుగుదేశం పార్టీ సభ్యత్వం ద్వారా లభించిన ప్రమాద బీమా ఆర్థిక భరోసాగా నిలిచింది.గతంలో నిర్వహించిన టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా రమణమ్మ కుటుంబ సభ్యులు పార్టీ సభ్యత్వాలు పొందారు. కొంతకాలం క్రితం రమణమ్మ తన తమ్ముడు నాగరాజుతో కలిసి ద్విచక్ర వాహనంపై కొలిమిరాలపల్లి వెళ్లి తిరిగి వస్తుండగా మార్గమధ్యంలో జింక అడ్డంగా రావడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో రమణమ్మ తీవ్రంగా గాయపడగా వెంటనే ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. ఆమె తమ్ముడు నాగరాజు స్వల్ప గాయాలతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. టీడీపీ సభ్యత్వంలో నామినీగా కుమార్తె ఉప్పుతోళ్ల రాజేశ్వరి పేరును నమోదు చేయడంతో ప్రమాద బీమా కింద రూ.5 లక్షల ఆర్థిక సహాయం కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈ సహాయం తమ కుటుంబానికి ఎంతో అండగా నిలిచిందని కుటుంబ సభ్యులు తెలిపారు.ఈ సందర్భంగా బీమా మంజూరుకు సహకరించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,మంత్రి నారా లోకేష్,పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి,మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి తోపాటు అమడగూరు మండల టీడీపీ నాయకులకు కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి చేతుల మీదుగా ప్రమాద బీమా చెల్లింపు పత్రాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ పి.శ్రీనివాసులు,నియోజకవర్గ అసెంబ్లీ వైస్ ప్రెసిడెంట్ గుర్రంకొండ తిరుపాల్, లబ్ధిదారులు ఉప్పుతోళ్ల రాజేశ్వరి, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

## గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

**బత్తలపల్లి, మే 10 మనం న్యూస్:** గుర్తుతెలియని వాహనం ఢీకొని గోనుగుంట్ల దేవేందర్ నాయుడు మృతి చెందాడు. బత్తలపల్లి ఎస్సై సోమశేఖర్ కథనం మేరకు.. తాడిమర్రి మండలం నిడిగళ్ళకు చెందిన గోనుగుంట్ల ఆంజనేయులు కుమారుడు గోనుగుంట్ల దేవేందర్ నాయుడు ధర్మవరం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణంలో కిరాణా దుకాణం పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. ప్రతిరోజు లాగే శనివారం రాత్రి దుకాణం బంద్ చేసుకొని ద్విచక్ర వాహనంలో స్వగ్రామానికి వస్తుండగా మండలం పరిధిలోని పొట్లమర్రి సమీపంలో ఉన్న పెట్రోల్ బంకు సమీపంలోని కల్వర్టు వద్ద వేగంగా వచ్చిన గుర్తుతెలియని వాహనం ఈయన ప్రయాణిస్తున్న వాహనాన్ని ఢీకొనడంతో ఆయన తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రున్ని స్థానికులు 108 వాహనంలో బత్తలపల్లి ఆర్డీటి ఆసుపత్రికి తరలించారు. ఇక్కడ ప్రథమ చికిత్సలు అందించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వివరించారు. మృతుని బంధువులు ఫిర్యాదు వరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.



## 12న జరిగే హనుమద్ జయంతిని జయప్రదం చేయండి



**కుందుర్పి మే 10 మనంన్యూస్:** కుందుర్పిలో స్థానిక కోట ఆంజనేయ స్వామి ఆలయంలో ఈనెల 12న మంగళవారం హనుమ జయంతిని పురస్కరించుకొని, ఆలయంలో కోట అంజన్న జయంతి వేడుకలును ప్రజలు అందరు , భక్తులు, హాజరు అయి జయప్రదం చేయాలని , ఆదివారం ఆలయ కమిటీ నిర్వాహకులు, అర్చకుడు, పూజారి దీలిప్, ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంగళవారం ఉదయం 9గంటలు నుండి 11వరకు అభిషేకం, గణపతి పూజ, నవగ్రహ పూజ, పుష్ప పూజ, స్వామివారికి కుంకుమార్చన, విశేష పూజలు,కార్యక్రమాలు నిర్వహిస్తారు. అనంతరం మధ్యాహ్నం ఒంటిగంట భక్తులకు అన్నసంతర్పణ సమారాధన కార్యక్రమం కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. అనంతరం శ్రీవారి గ్రామ పురవీధుల గుండా సాయంత్రం 6 గంటలకు ట్రాక్టర్ వాహనంలో గ్రామోత్సవం నిర్వహిస్తారు. కాగా అంజన్న భక్తాలందరూ అనుమ జయంతి వేడుకలలో పాల్గొని ,స్వామివారి కృపకు పాత్రలు కావాలని ఆలయ ధర్మకర్త ,ఏ,సత్యనారాయణ శాస్త్రి, మాజీ గ్రామ సర్పంచ్ కె, మారుతి రామ్మూర్తి, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పిలుపునిచ్చారు.

# హనుమాపురంలో భారీ మట్టి దందా...



- అడ్డుకట్ట వేయాల్సిన అధికారులు మౌనం!?
- రైతులు మాటున సహజవనరులు దోపిడీ
- కర్ణాటక కు చెందిన టిప్పర్ల కు అనుమతి ఎవరు ఇచ్చారు
- రైతులకు కావాల్సింది చెరువు పూడిక మట్టి
- గరుసమట్టి... లోతుగా గుంతలు పెట్టడమే రైతులకు అవసరమా?
- అధికారులు స్పందించి మట్టి దందాకు అడ్డు కట్టావేయాలి
- కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇంచార్జి గౌని

**కణేకల్ మే 10 మనంన్యూస్:** మండలం లోని ఎన్.హనుమాపురం గ్రామంలో జరిగిన మట్టి దందాకు సంబంధించి కొంతమంది తాము చేసిన దందాను సమర్ధించుకోవడం ఎంతవరకు సమంజసమని కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి గౌని ప్రతాప్ రెడ్డి శుటిగా ప్రశ్నిస్తున్నట్టు మనం కు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మట్టి దందా చేయడమే కాకుండా మేము నయా పైసా కూడా లాభం పొందాలనే ఆలోచన కూడా మాకు లేదని వారు చేస్తున్న తప్పులను కప్పిబుచ్చుకోవడానికి అధికార పార్టీ ని అడ్డుపెట్టుకోవడాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఒక ప్రజా పార్టీ నాయకుడిగా,భారత పౌరుడుగా మీరు చేస్తున్న దందా ను అది కూడా మీ గ్రామ రైతుల సమాచారం తోనే మాట్లాడుతున్న అనవసరం గా రెచ్చగొట్టే విధంగా ఇది రెడ్డి రాజ్యం కాదు అంటూ రెడ్డి రాజ్యం కాకపోయినా ఫర్వాలేదు కానీ మీరు రౌడీ రాజ్యాన్నే నడపండి ఏం పరవాలేదు దానికి ప్రజలు త్వరలో మీకు తగు బుద్ధి చెప్పడానికి సిద్ధం గా ఉన్నారన్నారు. చెరువులో కేవలం పూడిక మట్టిని పొలాలకు తోలితే దానివల్ల పొలాలు బాగా పండే అవకాసాలు ఉంటాయని అందరికి విదితమే. నేను రైతు బిడ్డ కాదా?, మా పెద్దలు తరతరాల నుండి రైతు పని చేశారని గమనించండి.రైతుల కొరకే మట్టి కావాలంటే సంబంధిత అధికారులతో అనుమతి ఎందుకు తీసుకోలేదని మండిపడ్డారు.ఈ విషయం పై గత రెండు రోజుల క్రితమే విడుదల చేసిన ప్రెస్ నోట్ లో పేర్కొనడం జరిగినది,లోతుగా తవ్విన పనికిరాని గరుసుమట్టి దానివల్ల పంట పొలాలకు తీవ్రంగా నష్టం జరుగుతుందనే విషయం మీరు తెలుసుకోండి. రైతుల పేరిట ప్రజాదనాన్ని మరియు సహజ వనరులను దోపిడీ చేయడం తగదని మాత్రమే నేను హితం పలికాను.కర్ణాటక కు చెందిన టిప్పర్లను ఎటువంటి అనుమతులు లేకుండా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనికి తీసుకుని రావడం చట్టరీత్యా నేరం కాదా, కేవలం మీరు మీ దందా కోసం కర్ణాటక రాష్ట్రానికి చెందిన టిప్పర్లను ఎందుకు తీసుకురావాల్సి వచ్చింది? కర్ణాటక రాష్ట్రానికి చెందిన టిప్పర్లు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అనుమతి లేకుండా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోకి తెచ్చినప్పుడు దానిపై చర్యలు తీసుకోవలసినటువంటి రెవెన్యూ , పోలీసు , రవాణా శాఖా మోటార్ వెహికల్స్ ఇన్స్పెక్టర్ ఎందుకు మౌనం గా ఉన్నారో సమాధానం చెప్పాలి.అనుమతి లేకుండా చెరువులో మట్టిని తరలించడానికి సంబంధించి మాట్లాడవలసింది చిన్న నీటిపారుదల శాఖ అధికారులు, కనీసం వారి అనుమతులు అయినా పొందారా,రైతులకు అవసరమైనప్పుడు చట్టరీత్యా అనుమతులు తీసుకొని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సంబంధించిన వాహనాలతో తోలుకోవచ్చు కానీ ఎలాంటి అనుమతులు లేకుండా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్మిట్ లేని, కర్ణాటక టిప్పర్ల యజమానికి బంధువైనటువంటి ఒక మధ్యవర్తి, కర్ణాటక రాష్ట్రం నుండి టిప్పర్లను తెప్పించి ఒక టిప్పర్ మట్టికి 5000 రూపాయల ప్రకారంగా రైతులతో వసూలు చేసి మట్టి తోలడం వాస్తవమా కాదా, ఈ సమాచారం ఎన్ హనుమాపురం గ్రామ ప్రజలందరికీ తెలుసు. ఒకవైపు మట్టి తోలడం వల్ల లాభం వచ్చింది, ఇంకొక వైపు వారి బంధువైన కర్ణాటక టిప్పర్ల యజమానికి బాడుగ డబ్బు దొరికింది ఇలా రెండు వైపులా లాభం పొందడమే కాకుండా అనవసరంగా కులాలు, పార్టీ లను అడ్డుపెట్టడం ఎంతవరకు సమంజసం.మీకు భయపడి రైతులు ధైర్యంగా ముందుకు వచ్చి, మీకు ప్రతి టిప్పర్ మట్టికి 5000 రూపాయల ప్రకారంగా చెల్లించామని చెప్పడానికి భయపడవచ్చేమో కానీ వాస్తవాలను మాత్రం ఎవరూ దాచి పెట్టలేరు. మొన్నటి రోజున నేను మట్టి మాఫియా గురించి మాత్రమే మాట్లాడాను కానీ ప్రతి చోట జరుగుతున్న మద్యం మాఫియా లో జరుగుతున్నా ఎమ్మార్పీ ధరలు మించి పది నుంచి 30 రూపాయల వరకు మద్యం బాటిల్ పైన అమ్ముతున్న ప్రతి ఒక్క మద్యం దుకాణం పైన చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ పోలీసులను కూడా విన్నవించుకుంటున్నానన్నారు. లేనిపక్షంలో కాంగ్రెస్ పార్టీ తరపున ప్రతి మద్యం దుకాణానికి వెళ్లి అక్కడ ప్రతినిత్యం జరుగుతున్న దోపిడీని చిత్రీకరించి అధికారుల కు ముఖ్యమంత్రి దృష్టికి కూడా తీసుకెళ్తామని అన్నారు. కావున సమబంధిత అధికారులు స్పందించి మట్టి మాఫియా, మద్యం అధిక ధరలకు విక్రస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# ప్రతిభ పురస్కారాలకు దరఖాస్తు చేసుకోండి...

**– కాకతీయ కమ్మ సేవా సంఘం ఆధ్వర్యంలో**
**తల్లిదండ్రులు లేని అనాథ విద్యార్థులకు ప్రత్యేక ప్రతిభ పురస్కారాలు**

**ధర్మవరం అర్బన్ ఏప్రిల్ 10, మనం న్యూస్:** శ్రీ సత్యసాయి జిల్లా పరిధిలో 550 మార్కులకు పైగా సాధించిన కమ్మ సామాజిక వర్గ విద్యార్థులు ఈ పురస్కారాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని కాకతీయ కమ్మ సేవా సంఘం తెలిపారు. అదేవిధంగా తల్లిదండ్రులు లేని అనాథ విద్యార్థులకు మార్కులతో సంబంధం లేకుండా ప్రత్యేక ప్రతిభ పురస్కారాలు అందించనున్నట్లు సంఘం తెలిపారు. ఆదివారం ధర్మవరం పట్టణంలోనే కమ్మ సంఘం కార్యాలయంలో ఆ సంఘ కుల బాంధవులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కాకతీయ కమ్మ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశం ఎంతో విజయవంతంగా జరిగింది. సమావేశంలో సంఘ పెద్దలు, సభ్యులు పాల్గొని పలు ముఖ్యమైన నిర్ణయాలు తీసుకున్నారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, మహానటుడు నందమూరి తారక రామారావు జయంతిని పురస్కరించుకుని మే 28వ తేదీన ప్రత్యేక కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా కమ్మ సమాజానికి చెందిన, ఇటీవల నిర్వహించిన పదవ తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు "ప్రతిభ పురస్కారాలు" అందజేయనున్నట్లు సంఘం ప్రకటించింది.



సమాజంలోని ప్రతిభను ప్రోత్సహించడం, విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడం సంఘం లక్ష్యమని సభ్యులు పేర్కొన్నారు. అర్హులైన విద్యార్థులు తమ దరఖాస్తులను మే 22వ తేదీలోపు సమర్పించాలని కోరారు. ఏవైనా సందేహాలు ఉంటే.. కార్యాలయ ఫోన్ నెంబర్ 9989390700 ఫోన్ చేసి తెలుసుకోవాలని వారు తెలిపారు.

## ఘనంగా సింగర్ తేజస్విని పుట్టినరోజు వేడుకలు

**హిందూపురం (మనం న్యూస్) మే 10:** హిందూపురం పట్టణం ఆర్ వి మెలోడిస్ సంగీత పాఠశాలలో ఆదివారం సింగర్ తేజస్విని జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆర్ వి మెలోడీస్ అధినేత వసంతరాజు సారథ్యంలో కేక్ కటింగ్ చేసి మిఠాయిలు పంచుకు న్నారు. సంగీత కళాకారులు తేజస్వినికి జన్మ దిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంగీత కళాకారులు, తేజస్విని శ్రేయోభిలాషులు, పట్టణ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## ఎన్టిఆర్ సృజల స్రవంతి తాగునీటి పథకం ప్రారంభం

**కుందుర్పి మే 10 మనం న్యూస్ :** కళ్యాణదుర్గం నియోజకవర్గం పరిధిలోని కుందుర్పి మండలం ,బెస్తరపల్లి గ్రామంలో ఆదివారం అమిలినేని సురేంద్రబాబు వారి సహకారంతో యన్,టి,ఆర్, సృజల స్రవంతి త్రాగునీరు పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. గత ప్రభుత్వం పాలకుల హయాంలో సర్పంచులు నిర్వీర్యం చేసి పక్కదారులను పట్టించారని విమర్శించారు. సర్పంచుల పదవి కాలం ఏప్రిల్ నెలలో 2న సమయం ముగిసిందన్నారు. ఈ సందర్భంగా స్థానిక కూటమినేతలు అందరూ కలిసి నిర్వీర్యమైన మినరల్ ప్లాంటును పూజ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు స్వీట్లు పంచుకొని హర్షం వ్యక్తం చేశారు.







# పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

**-ఇరవైళ్ళ అనంతరం ఒకే వేదికపై కలసిన గురువులు పూర్వ విద్యార్థులు**
**-మధుర జ్ఞాపకాలును పంచుకొన్న పూర్వ విద్యార్థులు**
**- పూర్వ విద్యార్థులు గురువులకు ఘన సన్మానం**



**కుందుర్పి మే 10 మనం న్యూస్ :**మండలంలోని, బెస్తరపల్లి గ్రామ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. ఈ క్రమంలోనే 2005 ,06 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థుల బృందం ఆధ్వర్యంలో ఆత్మీయ కలయిక ఆనాటి గురువులను రప్పించి ఘనంగా ఆదివారం సన్మానించారు. తొలత ఆనాటి గురువులకు పూర్వ విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. 20 ఏళ్ల తర్వాత విద్యార్థులు ఉపాధ్యాయులు అపూర్వ కలయికతో మధుర జ్ఞాపకాలను పంచుకొని వారి ఆనందానికి అవధులు లేకుండా గడిపారు. పూర్వ విద్యార్థులు అలనాటి గురువులు వారి జ్ఞాపకాలను స్మరించుకొని ఆనందం సంతోషాలతో పొంగిపోయారు. గత ఇరవై ఏళ్ల అనంతరం పూర్వ విద్యార్థులు ఆనాటి గురువులు ఒకే వేదిక పైన తలచుకోవడం చాలా గొప్పగా ఉందన్నారు .అలనాడు పాఠశాలలో విద్యార్థులు చేసిన చిలిపి చేష్టలనులను నెమరి వేసుకున్నారు. తమ గురువులను ఆదర్శంగా తీసుకుని ఉన్నత విద్యలో విద్య కుసుమాలు ఎదిగి నేడు ఎంతో మంది ఉపాధ్యాయులు పని చేస్తున్నారని గుర్తు చేశారు. అలనాటి గురువులకు పూర్వ విద్యార్థి గురువులు పూర్వ విద్యార్థులు ఈ సందర్భంగా వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం పూర్వ విద్యార్థులతో పాటు అలనాటి గురువులు కలిసి రుచికరమైన తిపి వంటకాలు భోజనాన్ని అరిగించారు ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు, చాంద్ బాషా ,ఉపాధ్యాయుడు, ఆర్,సుబ్బరామప్ప, వెంకటేశులు ,రాఘవేంద్ర బాబు, రవికుమార్ ,మాధవి, భాస్కర్, ప్రియాంక, పవన్, నగేష్, శృతి ,కావేల్లమ్మ, మంజునాథ, రాము ,నగేష్, నరేష్ , పూర్వ విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## కురుబ సంఘం అధ్యక్షులు గా దురుగప్ప ఎంపిక





**డి. హిరేహాల్ మే 10 మనం న్యూస్:** మండల కురుబ సంఘం అధ్యక్షుడిగా కందార్ దురుగప్ప ను మండలంలోని కురబ కులస్తులందరు అందరూ కలిసి ఏకగ్రీవంగా ఓబులాపురం గ్రామానికి చెందిన కందార్ దురుగప్ప ఎన్నుకున్నట్టు వారు తెలిపారు.ఈ నేపథ్యంలో కందర్ దురగప్ప ను మండలం లోని ఓబులాపురం టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు తాయప్ప మర్యాదపూర్వకంగా అభినందనలు తెలుపుతూ సన్మానించారు.ఈ కార్యక్రమంలో స్టోర్ డీలర్ బించే బసప్ప, వాల్మీకి బసవ పాల్గొన్నారు.





## ఘనంగా అమ్మవారి ఉట్టిమాను తిరుణాల..

# విజేతగా నాయనవారి పల్లి బృందం

**గాండ్లపెంట మే 10 మనం న్యూస్ :** గంగా భవాని అమ్మవారి 18 వ వార్షికోత్సవంలో భాగంగా ఆదివారము ఉట్టి మాను తిరణాల జాతర ఘనంగా నిర్వహించారు ఇందులో గాండ్లపెంట బృందం, ఎలుగుటివారి పల్లి బృందం,నాయనవారిపల్లి బృందం వారు పాల్గొన్నారు. చివరిగా నాయనవారిపల్లి బృందం ఉట్టి మాను విజయాన్ని చేదించారు. తదనంతరం అమ్మవారి గుడి చుట్టు బ్యాండ్ మేళాలతో ఎంతో ఉత్సాహంతో ప్రదక్షణ చేశారు. కోలాహలంగా యువకులు అందరూ కలిసి కట్టుగా విజయవంతం చేశారు. ఈ ఉత్సవానికి అధిక సంఖ్యలో భక్తాదులు, ఆలయ కమిటీ సభ్యులు ఆనంద్, నరసింహ గౌడ్, రవి, మహేష్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా టీడీపీ యువనాయకుడి జన్మదిన వేడుకలు



**డి.హీరేహాళ్ మే 10 మనం న్యూస్:** మండలం లోని నాగలాపురం గ్రామానికి చెందిన ఆ గ్రామ టీడీపీ యువ నాయకుడు గోవింద్ జన్మదిన వేడుకలను ఘనంగా ఆ గ్రామ పార్టీ నాయకులు నిర్వహించారు. ఈ మేరకు ఆయన హాజరై పార్టీ నాయకులు,కార్యకర్తల నడుమ కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు జరుపుకున్నారు.ఈ సందర్భంగా గోవింద్‌కు శాలువా కప్పి, పూలమాలలతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం టీడీపీ నాయకులు మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి కొరకు గోవింద్ కృషి చేససిన కృషి ఎనలేనిదని కొనియాడారు.ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మోటార్ సైకిల్ అదుపుతప్పి రైతుకు తీవ్ర గాయాలు

**హీరేహల్, మే 10 మనం న్యూస్ :** కర్ణాటక రాష్ట్రం కరిడిపల్లి గ్రామానికి చెందిన గాదిలింగ అనే రైతు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై గురు ప్రసాద్ రెడ్డి తెలిపిన వివరాలు మేరకు గాదిలింగ 30 సంవత్సరాలుహోసగుడం గ్రామ సమీపంలో ఉన్న తన పొలంలో సాగు పనులు ముగించుకొని ద్విచక్ర వాహనం లోహోసగుడం గ్రామం నుండి కరిడిపల్లి గ్రామానికి వెళ్తుండగా, మార్గమధ్యలో వాహనం అదుపుతప్పి కిందపడిపోయాడు. ఈ ప్రమాదంలో అతనికి తలకు తీవ్ర రక్తగాయం అయింది. స్థానికులు వెంటనే స్పందించి గాయపడిన గాదిలింగను చికిత్స నిమిత్తం బళ్లారి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతనికి వైద్యులు చికిత్స అందిస్తున్నట్లు సమాచారం. ఈ ఘటనపై డి. హీరేహల్ ఎస్సై గురు ప్రసాద్ రెడ్డికేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు తెలియజేశారు ఇక పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



# సచివాలయాల్లో 'ముడుపుల' కంపు పోలీసులకే తప్పని టోకరా ఇక సామాన్యుడి గతేంటి!

**– ఆలస్యంగా వెలుగులోకి**
**– జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేసే యోచనలో బాధితులు**




**కళ్యాణదుర్గం టౌన్ మే 10 మనం న్యూస్ :** ప్రజల ముంగిటకే పాలన, అవినీతికి తావులేని వ్యవస్థ అని చెప్పుకుంటున్న సచివాలయ వ్యవస్థ ఇప్పుడు విమర్శల పాలు అవుతోంది. అట్టడుగు స్థాయి వరకు పారదర్శకత వస్తుందని భావిస్తే, అక్కడ జరుగుతున్న వ్యవహారాలు చూస్తుంటే సామాన్యుడి వెన్నులో వణుకు పుడుతోంది. తాజాగా వెలుగులోకి వచ్చిన ఓ ఘటన ఈ వ్యవస్థలోని లోపాలను, కొందరు ఉద్యోగుల తెగింపును ఎత్తిచూపుతోంది.

**కాసులు ఇస్తేనే కదిలే ఫైళ్లు**

సచివాలయాల్లో అడుగు పెట్టాలంటేనే అక్రమ వసూళ్ల భయం పట్టుకుంది. లంచం ఇవ్వనిదే ఫైలు ముందుకు కదలదు, సంతకం పడదు అన్నట్లుగా పరిస్థితి తయారైంది. చివరకు ఒక ప్రతిపక్ష నాయకుడిని, శాంతిభద్రతలను కాపాడే ఇద్దరు కానిస్టేబుళ్లను కూడా వదలకుండా వారి జేబులకు చిల్లులు పెట్టారంటే సచివాలయ ఉద్యోగుల నెట్‌వర్క్ ఎంత బలంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

మాకే టోకరా కొడితే.. ఇక సామాన్యుల పరిస్థితి ఏంటి అని సదరు పోలీసు ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేయడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

**వాటాల పర్వం ఎవరికి ఎంత**

మున్సిపల్ కార్యాలయాలకు పంపాలి, పై అధికారులకు ఇవ్వాలి అంటూ ముక్కుపిండి వసూలు చేస్తున్న ఈ మాయాజాలంలో వాటాల పంపకం కూడా పక్కాగా జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

క్షేత్ర స్థాయి సిబ్బంది నుంచి మున్సిపల్ కార్యాలయాల వరకు ఈ 'మామూళ్ల' గొలుసుకట్టు వ్యవహారంలో ఎవరి వాటా ఎంత? అనే దానిపై ఇప్పుడు అంతర్గత విచారణలు మొదలయ్యాయి.

**న్యాయం కోసం కలెక్టర్ గడపకు**

తమకే న్యాయం జరగకపోతే సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్న పోలీస్ శాఖ ఉద్యోగులు, ఈ విషయాన్ని సీరియస్ గా తీసుకున్నారు. బాధ్యులైన సచివాలయ ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరిస్తున్నారు వ్యవస్థ ప్రక్షాళన ఎప్పుడు అవినీతి రహిత పాలన అని నినదిస్తున్న తరుణంలో, క్షేత్రస్థాయిలో ఇలాంటి దందాలు జరగడం విచారకరం. పోలీసులనే బురిడీ కొట్టించిన సచివాలయ ఉద్యోగులపై ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి. సామాన్యుడు కార్యాలయానికి వెళ్లాలంటే భయం లేని రోజూ ఎప్పుడొస్తుందో.

# ప్రభుత్వ భూములలో నమోదు అయిన పేర్లు తొలగింపునకు నోటీసులు

**– స్వాధీనానికి రెవెన్యూ శాఖ కఠిన చర్యలు**
**– తహశీల్దార్ దేవేంద్ర నాయక్**



**నంబుల పూలకుంట మే 10 మనం న్యూస్:** సంబులపులకుంట మండలంలోని గౌకనపల్లి రెవెన్యూ గ్రామం, టి.ఎన్ పల్లె పంచాయతీ పరిధిలోని సర్వే నెం. 214-7 విస్తీర్ణం 5.00 ఎకరాల భూమిపై వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో తహసీల్దార్ దేవేంద్ర నాయక్ వ్యక్తిగతంగా స్థల పరిశీలన నిర్వహించారు. పరిశీలనలో సదరు భూమి దేవుని మన్యం భూమి కాదని, ప్రభుత్వ భూమిని గతంలో నరసమ్మ అనే గుడి పూజారికి అసైన్మెంట్ రూపంలో మంజూరు చేసినట్లు ప్రాథమిక రికార్డుల ద్వారా గుర్తించారు. నరసమ్మకు వారసులు లేకపోవడంతో ఆమె మరణానంతరం సంబంధిత భూమి పూజారి రామకృష్ణ పేరుపై మంజూరు చేయబడినట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం భూమికి సంబంధించిన రికార్డుల పరిశీలన అనంతరం ప్రభుత్వానికి తిరిగి స్వాధీనం (Resumption) చేసుకునే ప్రక్రియ చేపట్టినట్లు వెల్లడించారు. ఈ మేరకు సంబంధిత వ్యక్తులకు రెసంప్షన్ నోటీసులు జారీ చేయడం జరిగిందని, వెబ్లాండ్ రికార్డుల్లో ప్రభుత్వ భూమిగా నమోదు చేసే చర్యలు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. ప్రస్తుతం రీ-సర్వే ప్రక్రియ కొనసాగుతోందని, ఆన్‌లైన్‌లో నమోదైన పేర్లు తొలగించి భూ స్థితిని "నరసింహస్వామి గుడి" పేరుతో నమోదు చేయబడుతుందని తెలియజేశారు. ఈ విషయంలో గ్రామస్తులు ఎవరూ అపోహలకు గురి కావద్దని అధికారులు సూచించారు. సదరు భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకునే ప్రక్రియలో భాగంగా సంబంధిత నోటీసులు ఇప్పటికే జారీ చేయబడినట్లు తెలిపారు. తహసీల్దార్ స్వయంగా స్థలాన్ని తనిఖీ చేసి పూర్తి నివేదిక సిద్ధం చేస్తున్నట్లు సమాచారం.

# హాఫ్ మూన్ మోడల్ బీడు పడిన భూములకు జీవం

**గుడిబండ మే 10 మనం న్యూస్:** గుడిబండ మండలం రాళ్ళపల్లి గ్రామంలో ఆదివారం రైతు నాగేశ్రప్ప గారి బీడుపడిన పొలంలో హాఫ్ మూన్ మోడల్ నిర్మాణం విజయవంతంగా నిర్వహించబడింది. డిపిఎం లక్ష్మీన్ నాయక్ డి టి రమేష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని రైతుల సమక్షంలో నిర్వహించారు. హాఫ్ మూన్ మోడల్ అనేది వర్షపు నీటిని నిల్వ చేసేందుకు ఎత్తు భూముల్లో అమలు చేయబడే అత్యంత ప్రభావవంతమైన పద్ధతి. ఈ మోడల్ను అర్ధచంద్రాకారంలో రూపొందించి, సుమారు 5 అడుగుల ఎత్తు మరియు 2 అడుగుల వెడల్పుతో నిర్మించారు. ఈ విధానం వర్షపు నీటిని భూగర్భానికి చొచ్చుకుపోయేలా చేసి, భూమిలో తేమను నిలుపుతుంది. ఈ విధానంతో మొక్క జొన్న, అలసంద, పంటల అభివృద్ధికి తోడ్పాటు అందుతుందన్నారు. మరియు భూగర్భజల స్థాయి కూడా మెరుగుపడుతుందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా రైతులకు నీటి పరిరక్షణ పద్ధతుల పట్ల అవగాహన పెరిగింది. ఈ విధానాన్ని చూసిన రైతులు తమ భూముల్లో కూడా ఇదే విధానాన్ని అనుసరించాలని నిర్ణయించారు. ఈ ప్రయోగం శాస్త్రీయంగా విజయవంతమవుతుందని నిర్వాహకులు నమ్మకాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కమ్యూనికేషన్ థిమెటిక్ మల్లేశ్వరి మరియు రైతులు పాల్గొన్నారు.



## శనివారం శ్రీవారికి ఈ 1 నైవేద్యం పెడితే 7 శనివారాల్లో శని దోషం పూర్తిగా తొలగిపోతుంది

**మడకశిర, మే 10, మనంన్యూస్:** శనివారం రోజు శ్రీవారికి ఈ 1 నైవేద్యం పెడితే 7శనివారల్లో శని దోషం పూర్తిగా తొలగి పోవడం ఖాయం.తిరుమలలో ఒక రహస్య సంప్రదాయం ఉంది. ప్రతి శనివారం శ్రీవారికి నల్ల నువ్వులు, బెల్లం నైవేద్యం పెడతారు. ఎందుకంటే? నల్ల నువ్వులు శని దేవునికి ప్రీతికరమైనవి, బెల్లం శ్రీవారికి ఇష్టమైనది.



**7 శనివారాల ప్రత్యేక విధానం:**

ప్రతి శనివారం ఈ 6 సింపుల్ స్టెప్స్ చేయండి. ఉదయం స్నానం చేసి, నల్లని దుస్తులు ధరించండి. శ్రీవారి చిత్రం ముందు ఆంజనేయ స్వామి చిత్రం ఉంచండి. నల్ల నువ్వులు, బెల్లం కలిపి శ్రీవారికి సమర్పించండి. ఈ కింది మంత్రం 11 సార్లు జపించండి. ఓం నమో వేంకటేశాయ, శనైశ్చరాయ నమః. హనుమాన్ చాలీసా ఒక్కసారి పఠించండి. ఆ నైవేద్యాన్ని ఒక కాకికి లేదా నల్లని జంతువుకు పెట్టండి వరుసగా 7 శనివారాలు చేస్తే శని దోషం పూర్తిగా తొలగిపోతుంది, జీవితంలో స్థిరత్వం వస్తుంది.